



ఆ రాత్రి ఏదో రాయాలని కూర్చున్నాను.

అప్పుడు నా మనసులో జయమ్మ మెదిలింది.

జయమ్మ గుర్తుకొస్తే చాలు నాలో చాలా ఆలోచనలు అర్థంకాని విధంగా గంద్రగోళపరుస్తూ వుంటాయి.

జయమ్మ — మబ్బుపట్టిన ఆకాశంలో విద్యుల్లత మెరిసినట్లుగా. వెన్నెల్లో మల్లెపూల పాన్పుమీద జవ్వని పడుకున్నట్టుగా అందంగా వుంటుంది. నాజూగ్గా వుంటుంది. హుషారుగానూ వుంటుంది.

ఆ కుటుంబానికీ, నాకూ సాన్నిహిత్యం వుంది. ఇళ్ళ మధ్య దూరం వందగజాల లోపు ఈ దూరమే మాకు స్నేహాన్ని కలిగించిందంటే కాస్త బావుంటుంది.

వాళ్ళనాన్న అప్పట్లో ఐదొందలు జీతం తెచ్చుకునే చిన్న ఆఫీసరు. ఇప్పుడాయన లేరు! రెండు సంవత్సరాల క్రితం హఠాత్తుగా పాపం పోయారు. జయా, వాళ తమ్ముడూ, వాళ్ళమ్మా ఇప్పుడా కుటుంబం.

జయ బి. ఏ. చదువుకుండగా వాళ్ళనాన్న పోవడంవల్ల చదువాపేసింది. అంటే— చదువాగిపోయింది.

వాళ్ళనాన్న చనిపోవడం ఎవరికెలా వున్నా జయ విషయంలో నా అంచనాలు తారుమారయ్యాయి!

• • • • •

నెలరోజులు గడిచిపోయాయి

నేను వాళ్ళను ఆర్థికంగా చాలా ఆదుకోవలసి వొచ్చింది తండ్రి లేని లోటు జయను ఎక్కువగా కలవర పెట్టలేదనుకుంటాను. ఒక వారం రోజుల్లోనే ఇంటిపనులన్నీ చూసుకుంటూ వుండిపోయింది.

"శంకరం! నీతో మాట్లాడాలి." అన్నది ఒకరోజున.

కాంతమ్మగారు గదిలో పడుకున్నారు. బాబు స్కూలుకు వెళ్ళాడు. జయ ముఖంలోకి చూశాను,

"మా విషయాలు గురించి మాట్లాడాలి" అన్నది.

"నీకు తెలియందేమున్నది శంకరం? మా నాన్న పోయేసరికి నాలుగు వందలు మిగిలాయి ముందు గడవాలంటే మరింక నేనేం చెయ్యాలి. ఈ ఇంటి బాధ్యతను స్వీకరించాలి. ఉద్యోగం చూసుకోవాలి"

నేనేమీ మాట్లాడలేదు జయను అలాగే చూస్తుండి పోయాను. జయను అలా చూడ్డం నాకిష్టం. ఆమె మాటలు నాకిష్టం. ఆమె చిరునవ్వు నాకిష్టం. వీటన్నింటితో జయ సౌందర్యం నన్ను చాలా పెద్ద ఆలోచనలోకి తీసుకెడుతున్నాయి! ఇది నాకు తెలుసు.

"శంకరం" అన్నది.

నేను కొంచెం సిగ్గుపడ్డాను.

"నా బాధ్యత నీ మీద పెడుతున్నాను. మమ్మలను నిలబెట్టే బాధ్యత నీది. నువ్వు తలచుకుంటే నాకు ఉద్యోగం ఇప్పించగలవు. ఐ నో యిట్!! అని నా చేతులు పట్టుకుంది ఆప్యాయంగా.

అప్పుడామె స్పర్శ వెచ్చగా వుంది. గగుర్పాటుగా వుంది, అలాగే ఆమె చేతిని నిమురుతూ గట్టిగా పట్టుకున్నాను. నా మనసులో చలిలాటిది చోటు చేసుకుంది. కంగారుగా వుంది. బెరుగ్గావుంది.

"నువ్వు కావాలంటే తప్పకుండా ఉద్యోగం యిప్పిస్తాను." నువ్వు సుఖంగా వుండటమే నా క్కావాలి జయా!'

ఆమె నా చేతిని ఇంకా గట్టిగా అదిమిపట్టింది.

"అవును జయా! నువ్వంటే నాకు ఇష్టం. నీ చేయి తాకుతేనే నాకెంతో ఆనందంగా వుంది. ఐ లవ్ యూ వెరీ మచ్."

జయ నవ్వింది!

'జయా నీకోసం ఏమైనా చేయగలను."

"అమ్మను చూస్తుంటే దిగులుగా వుంది శంకరం! నాన్న పోయిన దగ్గిరనుంచీ అమ్మ ఆకారం లేకుండా పోయింది. తిన్న రోజున తింటోంది లేని రోజున అలాగే చాపమీద కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది."

"అందుకని ....."

"తప్పనిసరై చదువు మానవలసి వస్తోంది. ఒక వేళ నేను డిగ్రీ తీసుకున్నా మంచి ఉద్యోగం వస్తుందనీ నమ్మకం లేదు. తమ్ముడిని చదివించాలి"

"మీ అమ్మగారితో ఈ విషయం చెప్పావా?"

"నా నిర్ణయం అమ్మ కాదనదు పరిస్థితులు ఇరుగ్గా వున్నప్పుడు అమ్మ మట్టుకు ఏం చేస్తుంది?"

"ఉద్యోగం ఇప్పిస్తాను. జీతం ఎంత కావాలి?" అన్నాను నవ్వుతూ

"ప్రభువుగారి చిత్తం. ఇబ్బందుల్లేకుండా చూసుకోవలసిన వారు మీరు" అన్నది. కళ్ళు అదోలా పెట్టి.

"దేవిగారి ఆజ్ఞ."

అంతలో జయ గంభీరంగా మారిపోయి అన్నది—

"శంకరం! నీ ఋణం తీర్చుకోలేను. ఇప్పటి వరకూ నువ్వు చేసిన సహాయం మరచిపోలేనిది. నువ్వు గనుక లేకపోతే మాగతి ఏమైపోయేదో! ఇది తలచుకోవడానికే భయంగా వుంది."

# వర్థిల్లు! జయశ్రీ వర్థిల్లు

ఇప్పుడు నా మనసంతా హాయిగావుంది. మధురమైన ఊహలు మధురంగా చోటు చేసుకుంటున్నాయి. ఇంతకాలం నేను మానసికంగా అనుభవించిన వ్యధకు దారి కనిపించింది!

నేనంటే జయకిష్టం! జయంటే నా కిష్టం!

ఇదే నాక్కావలసింది. దీన్ని అభిమానమంటారో, గౌరవం అంటారో నాకు తెలీదు. ప్రేమంటే మాత్రం వొప్పుకోను! ఎందుకంటే— ప్రేమించి వర్ణాంతర వివాహం చేసుకునేపాటి వ్యక్తిని కాను. ప్రేమ పేరుతో పిచ్చెక్కి గడ్డం పెంచుకుని, జుట్టు చింపుకుని ప్రేయసిని తలంచుకుంటూ రోడ్లంట తిరగడం నాకిష్టంలేదు! ఇటువంటి ప్రేమలో నాకు నమ్మకంలేదు. అటువంటివారి మనసులన్నీ వికృత ప్రేమతో నిండి పోయాయని నా ఉద్దేశం. అంచేత నేను ప్రేమించి పిచ్చివాడిని కాను!

జయంటే నాకిష్టం. అదే నేను కోరుకునేది.

ఆ రోజు సాయంత్రం చీటీరాసి పంపింది జయ—

వాళ్ళింటికి రమ్మని.

నాకున్న పనులవల్ల రాత్రి ఎనిమిదింటి కెళ్ళేను.

జయ తలుపు తీసింది.

ఆమె చాలా అందంగా వుంది. తలంటు పోసుకుంది. జడ వదులుగా అల్లుకుని గులాబీలు పెట్టుకుంది. గులాబీ చీరంటే నాకు చాలా ఇష్టం. నా ఇష్టాన్ని గ్రహించి ఆమె దేవతలా నుంచునుంటే నా శరీరం మత్తుగా ఐపోయింది.

"జయా!" అంటూ ఆమె బుగ్గమీద చేయి వేశాను. ఆమె సిగ్గుపడింది. ఒకసారి నా కళ్ళల్లోకిచూసి తలొంచుకుంది. గోడకు ఆనుకుంది వెళ్ళి.

జయ మాట్లాడక పోవడం, సిగ్గుపడడం నాకు ధైర్యాన్నిచ్చింది.

అప్పుడామెను నా చేతుల్లోకి తీసుకున్నాను. ముద్దు పెట్టుకున్నాను. ఆ క్షణం కోసమే ఎదురుచూస్తున్నట్టుగా జయ నాలో ఇమిడిపోయింది. నేను ఆమె వీపును నిమురుతూ మాట్లాడుతున్నాను—

"జయా! నీ కోసం చాలా మథనపడ్డాను. ఇటువంటి రోజు కోసమే కాసుకున్నాను. నువ్వు నా దానివనే నమ్మకం కలిగింది. చెప్పు నీ కేం కావాలో?" అన్నాను.

ఈ సమయంలో నా గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి.




వెన్నులోంచి ఏదో జలజలా పాకుతోంది. ఆమెను ఇంకా దగ్గరకు తీసుకోవాలనిపిస్తోంది. ఈ అనుబంధం ఇలాగే శాశ్వతంగా వుండిపోవాలనిపిస్తోంది!

"శంకరం! నువ్వు నాక్కావాలి. నీతోడులేనిదే నాకు బతుకు లేదు!" అన్నది.

ఆమె ఇంకేం మాట్లాడుతోందో నాకేం వినబడడం లేదు. జయ నెమ్మదిగా నన్ను విడిపించుకుంది. కుర్చీలోకివెళ్ళి కూర్చుంది. ఎదురుగా వెళ్ళి కూర్చున్నాను.

ఆమె ఒక్కసారిగా ఊపిరిపీల్చి వొదిలి—

"శంకరం! మాకు దారిచూపించావు. నీ ఋణం తీర్చుకోలేను. నీ దయవల్ల నాకు ఉద్యోగం వొచ్చింది. నిజంగా మీ—

"ఋణం తీర్చుకున్నావుగా!" నవ్వాను.

"అవునా! ఈ సంగతి చెప్పడానికేనా నన్ను రమ్మంది?" అన్నాను మళ్ళా. జయ మాట్లాడలేదు. తలొంచుకుని నవ్వుకుంటోంది. బహుశా, ఇటువంటి సందర్భం కోసమే ఎదురు చూస్తుండవచ్చు. అందుకే ఆమే కావాలని ఇది ఏర్పాటు చేసిందేమో! — ఇది నిజం కావచ్చు. కాకపోనూవొచ్చు.

\+ \+ \+

ఒకానొక సంఘటన నాకు అమితమైన ఆశ్చర్యాన్ని, కోపాన్ని కలిగించింది.

ఆరోజు సాయంత్రం ఆరు గంటలు కావస్తోంది. నేను మేడ మీద గదిలో కూర్చుని చదువుకుంటున్నాను.

సంధ్య చీకట్లు ఆవరించుకుంటున్నాయి. వెలుగూ చీకటీ కాని అందమైన సమయం.

ఆ సమయంలో ప్రసాద్ వగర్చుకొచ్చాడు. వాడెప్పుడూ ఇంతే! ఏదో విశేషం వుంటేగానీ ఇలా రాడు!

"నేను నవ్వుతూ— ఏవిట్రా!" అన్నాను.

"ముందు నాతోరా?"

"విషయం?"

"చాలా వుంది."

"ఎవరి విషయం?" అన్నాను మళ్ళీ నవ్వుతూ.

"నీ విషయం. అవతల కొంపలంటుకున్నాయి" అన్నాడు ప్రసాద్ సీరియస్‌గా.

"నువ్వెప్పుడింతేరా? అసలేం జరిగింది?"

"నీ నమ్మకానికి దెబ్బతగిలింది. నువ్వోడిపోయావ్." ప్రసాద్ మాటలు విచిత్రంగా వున్నాయి. వెంటనే నేనులేచి— "పద" అన్నాను.

దారిలో అన్నాను—

"ఇప్పుడెక్కడికి?"

"మాట్లాడకుండా రా. నా కసలు ఈ మనుషుల మీద ఏనాడో నమ్మకం పోయింది. అవకాశం ఉన్నంతవరకూ మనిషిని మనిషి నమ్మించడం మోసగించడం... ఇది నీకు చేతకాదు. అసలు నువ్వొట్టి ఫూల్‌వి. నీ నమ్మకాలు నీవి. అందుకే దెబ్బతిన్నావ్." ప్రసాద్ కోపంగా అన్నాడు.

"సూటిగా చెప్పరా?"

"జయంటే నీకు ఇష్టమని నాకు తెలుసు. ఆ అందాల రాశిమీద నీకెటువంటి అభిప్రాయం?" అన్నాడు.

వాడెక్కడో మొదలుపెట్టి జయ ప్రసక్తి తీసుకురావడం నాకు నవ్వొచ్చింది. నవ్వేశాను జవాబుగా.

ఇద్దరం ఓ ఇంటి ముందాగాం.

అప్పుడు ప్రసాద్ అన్నాడు—

"చూడు మైడియర్ ఫ్రెండ్! ఆ ఇంట్లో జయ వుంది. అక్కడేం తమాషా జరుగుతోందో వెళ్ళి కిటికీలోంచి చూడు."

వాడిముఖంలోకి చూశాను.

"నీ జయ మరొకడితో వుంది వెళ్ళిచూడు."

నాకా క్షణం ఆశ్చర్యం వేసింది! కోపం వొచ్చింది.

"అలా చూడకు చెప్పు." అన్నాడు ప్రసాద్.

సభ్యత కాదని తెలిసినా కిటికీ దగ్గరకు వెళ్ళాను.

కిటికీ తలుపులు వేసివున్నాయి. గదిలో సన్నని కాంతి వుంది. రేడియోలోంచి మెల్లగా పాశ్చాత్య సంగీతం వినిపిస్తోంది.

నేను విసుగ్గా ప్రసాద్ దగ్గరకు వచ్చాను.

"నువ్వు చెప్పేది నిజమేనా ?" అన్నాను.

"నా కళ్ళారా చూశాను. కొన్ని రోజులు పరిశీలనమీదట — ఇది ఈ నాటి రూపం. చూశావా ఫ్రెండ్ ?"

"ఇది నే నమ్మను. జయకు నా మీదున్న అభిమానానికి నువ్వు జెలసీ చెందుతున్నావ్." అన్నాను.

"జెలసీ కాదు! నీ మీదున్న స్నేహానికి స్నేహ ధర్మంగా చేశాను. ఆమె ఉద్యోగంలో చేరిందిమొదలు ప్రతి చర్యా కనిపెడుతున్నాను. నువ్వెక్కడ మోసపోతావోనని భయపడి పోయాను. చెప్పరా! నేన్నీకు ద్రోహినా? నీ సహాయాన్ని మరచిపోయినదాన్ని ఏమనాలి ?"

నేను మాట్లాడలేకపోయాను.

ఇదేమిటి ? ఇదెలా జరిగింది ?

నువ్వు తప్ప నా కింకెవరూ లేరు శంకరం ! అన్న జయ ఎందుకిలా ప్రవర్తించింది ?

మేమిద్దరం చాలాసేపు చెట్టు క్రీనీడలో నుంచున్నాం.

దాదాపు తొమ్మిది గంటలు కావస్తోంది. ఆ ఇంటికేసి చూశాను. అప్పుడే ఆ ఇంట్లోనుంచి ఎవరో మెట్లుదిగి కిందికి దిగారు. గబగబా నడుస్తూ వస్తున్నారు. వెలుతురులో చూశాను.

ఆమె జయ !

నాకు చాలా కోపం వొచ్చింది. ఆమె మీద అసహ్యం కలిగింది. ఆమె మీద ఏర్పరచుకున్న నా ఉద్దేశాలన్నీ అపహాస్యం చేస్తున్నట్టనిపించింది. వెంటనే వెళ్ళి జయ చెంప చెళ్ళుమనిపించా లనిపించింది

ప్రసాద్ నా భుజం మీద చేయివేసి—

"చూసింది మరచిపో ఫ్రెండ్ ! ఇంకెప్పుడూ ఆమెతో స్నేహం చేయమాకు. నువ్వంటే ఇష్టం లేని మనిషికి నువ్వెందుకు సహాయం చెయ్యాలి." అన్నాడు.

నేను మాట్లాడలేదు.

"ఆ ఇల్లు ఎవరిదనుకుంటున్నావు ?"

"నాకు తెలీదు."

"వాళ్ళ ఆఫీసరుది !"

ఒక్క క్షణం నేను తెల్లబోయాను !

ఆ తర్వాత పక పకా నవ్వేశాను.

నన్ను ప్రసాద్ వింతగా చూశాడు.

* * * *

ఆ మరునటిరోజు జయ దగ్గరకెళ్ళాను. వంటరిగా గదిలో కూర్చొని ఇంగ్లీషు మేగజైన్ తిరగేస్తోంది.

నన్ను చూసి లేచి నవ్వుతూ— "దయచేయండి" అన్నది

ఆ నవ్వు నాకు చిరాకేసింది. కసిగా ఆమెను చూస్తూ అన్నాను—

"ఏమిటీ నాటకం"

ఆమె విస్తుపోయి అన్నది— "అదేమిటలా వున్నావ్."

"ముందు నీ సమాధానం నాక్కావాలి."

"ఏదో ఆవేశంలో వున్నావ్. కూర్చో." అంటూ నా చేయి పట్టుకుంది.

ఆమె చేతిని కోపంగా విదిలించుకున్నాను.

"ఒక మనిషిని నమ్మించి మోసగించడం నీకు బాగా చేతనవును. అవునా ?"

జయ పకపకా నవ్వేసింది—

"నామీద యుద్ధానికొచ్చినట్టు కనిపిస్తున్నారేం బాబూ ఏమిటిసంగతి"

"రాత్రి నువ్వెక్కడికెళ్ళావ్?"

"ఒక ఆడది రాత్రి ఎక్కడికైనా వెడుతుందా?"

"నువ్వువెళ్ళావ్?"

"........."

"మొన్నరాత్రి తొమ్మిది గంటల వరకూ ఆఫీసరుగారింట్లో వున్నావ్. అవునా?"

"ఎవరు చెప్పారు?"

"చూశాను!"

"మీ కిటువంటి విషయాల్లో ఆసక్తి వున్నట్లుందే. ఎవరినో చూసి నామీద విరుచుకు పడతారే. మీరు భలేవారు!" అంటూ నా కెదురుగా వొచ్చి చుబుకాన్ని పైకెత్తి—

"ఇదంతా కోపమే? నో...నో...మీ రిలా వుండడానికి వీల్లేదు" అంటూ హఠాత్తుగా నన్ను ముద్దు పెట్టుకుంది.

నన్ను మాట్లాడనీయకుండా ఏవేవేవో చెప్పసాగింది.

"నువ్వేదో అపోహ పడుతున్నావ్. నే నెప్పటికీ నీదాన్నే."

జయ నా తల్లోకి వేళ్ళు పోనిచ్చి నిమరసాగింది.

ఆమె ఊపిరి. చూపులు, కవ్వింపు, స్పర్శ... చాలా హాయిగా వుంది, సర్వం మరచి పోయాను.

జయను నా చేతుల్లో బంధించాను.

"ఇప్పుడు నేను నీ దాన్ని...కాదనకు......"

\+ \+ \+

వారం రోజులు గడిచిపోయాయి

జయ నా కెక్కనిపించలేదు.

ఆమె సాన్నిధ్యంలో అన్నీ మరచిపోయి గడపాలని ఆరాటంగా వుంది. ఆ సమయంకోసం ఎదురు చూస్తూ జయ ఇంటికెళ్ళాను.

ఆమె గదిలో మంచంమీద పడుకునుంది

తట్టి లేపాను దిగ్గున లేచింది. దూరంగా జరిగింది.

"ఆగండి!" అన్నది.

ఆమె కేసి చూశాను

"ఇక్కడినుంచి వెళ్ళిపో."

"చిత్రంగా మాట్లాడుతున్నావ్."

"అవును!"

"అవునేమిటి?"

"ముందిక్కడనుంచి వెళ్ళిపో."

అప్పుడు నా కనిపించింది—

జయా! కాదు జయమ్మా!

నువ్వు బతకనేర్చి అద్భుతంగా మాటలు పలికే చిలుకవి. ఎప్పుడు ఏ అవసరంలో ఎవరిదగ్గర ఎలా ప్రవర్తించాలో నీకు బాగా తెలుసు. నా అవసరం తీరిపోయింది. మరో అవసరంలో మరో వ్యక్తి!

వెరీ గుడ్! నీ బతుక్కి దరిద్రం లేదు జయమ్మా ! ఈ ప్రపంచంలో ఎక్కడ ఏ మూల కెళ్ళినా నువ్వు నేర్పుగా నెగ్గుకు రాగలవు. నువ్వు లౌక్యం తెలిసిన జయమ్మవు! వర్ధిల్లు జయమ్మా ! వర్ధిల్లు!

"ఇంతకీ ప్రమోషనొచ్చిందా?" అన్నాను. ఆమె నవ్వుతూ—

"త్వరలో రాబోతోంది!" అన్నది. గబగబా అడుగులు వేసుకుంటూ బయట కొచ్చేశాను అక్కడనుంచి"

